

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3

అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
మంగళవారం 6 ఫిబ్రవరి 2024

చంద్రబాబుకు నీరాజనం



గొండుపాలెంలో 'రా.. కదలిరా' సభ సూపర్ సక్సెస్

గొండుపాలెం 'రా... కదలిరా' సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు నాయుడు

భారీగా తరలివచ్చిన జనం

- జై బాబు..జైజై బాబు అంటూ పెద్దపెట్టున నినాదాలు
- టీడీపీ, జనసేన శ్రేణులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం
- ఖాళీ లేకపోవడంతో రోడ్లపైనే ఉండిపోవాల్సిన పరిస్థితి
- వెంకన్నపాలెం నుంచి కె.కోటపాడు వరకు పసుపుమయం
- ఊహించినదానికన్నా ఎక్కువ మంది హాజరు కావడంతో తెలుగు తమ్ముళ్లు ఉబ్బితబ్బిబ్బు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్-అనకాపల్లి/చోడవరం/కె.కోటపాడు/మాడుగుల)

'రా...కదలిరా' నినాదంతో తెలుగుదేశం పార్టీ సోమవారం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెం సమీపంలో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం అయ్యింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వందలాది వాహనాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో సభకు హాజరయ్యారు.

ఇటు వెంకన్నపాలెం నుంచి అటు కె.కోటపాడు వరకు మొత్తం పసుపుమయం అయ్యింది. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించడానికి ముందే సభా ప్రాంగణం మొత్తం నిండి పోయింది. దీంతో చాలా మంది కార్యకర్తలు రోడ్డుపైనే ఉండిపో యారు. 'రా.. కదలిరా' సభకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది హాజరు కావడంతో తెలుగు తమ్ముళ్లు ఉబ్బితబ్బిబ్బయ్యారు. వచ్చే ఎన్నికల్లో మాడుగులలో తెలుగుదేశం గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

'రా.. కదలిరా' సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ప్రకటించగా, తొమ్మిది గంటల నుంచే పలు నియోజకవర్గాల నుంచి టీడీపీ కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతి పరులతోపాటు జనసేన శ్రేణులు కావడం మొదలుపెట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉదయం 11:45 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో సభాస్థలికి చేరుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు, ప్రజలు కేరింతలు కొడుతూ జై బాబు, జై జై బాబు అంటూ నినాదాలు చేశారు. హెలీప్యాడ్ వద్ద మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు, మాడుగుల ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకుడు పైలా ప్రసాదరావు, తదితరులు ... మిగతా 5వ పేజీలో


సభకు హాజరైన అశేష జనం

విశాఖను వైసీపీ నేతలు దోచుకున్నారు

నాడు పెట్టుబడులకు స్వర్గధామం.. నేడు కబ్జాదారులకు కేంద్రం

- టీడీపీ తెచ్చిన కంపెనీలను వెళ్లగొట్టారు
- ఉత్తరాంధ్రలో అభివృద్ధి లేదు.. యువతకు ఉద్యోగాలు లేవు
- జగన్‌కు మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం
- అరాచక పాలనను అంతమొందించాలని ప్రజలకు పిలుపు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్-అనకాపల్లి/చోడవరం/కె.కోటపాడు/మాడుగుల)



ఉత్తరాంధ్ర అభివృద్ధికి టీడీపీ హయాంలో ఎన్నో కంపెనీలను తీసుకొస్తే, జగన్ వచ్చిన తరువాత తరిమేశారని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆరోపించారు. సోమవారం మధ్యాహ్నం 'రా...కదలిరా' పేరుతో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రశాంతతకు నిలయమైన విశాఖపట్నం..వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అశాంతి, హింసకు నిలయంగా మరిందని చంద్రబాబు ఆందోళన వ్యక్తంచేశారు. రుషికొండను అనకొండలా మింగేసి రాజ ప్రాసాదం కట్టుకున్నారని జగన్‌ను ఉద్దేశించి అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ఇస్తున్న రూ.1.5 లక్షలు తప్ప రాష్ట్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. ఉత్తరాంధ్రలో రోడ్లు వేయలేదు, అభివృద్ధి లేదు, పిల్లలకు ఉద్యోగాలు రాలేదన్నారు. విశాఖ జిల్లా పెట్టుబడులకు స్వర్గధామమని, కానీ వైసీపీ పాలనలో కబ్జాదారులకు కేంద్రంగా మారిందన్నారు. ఒక్క విశాఖపట్నంలోనే వైసీపీ నాయకులు రూ.40 వేల కోట్ల విలువ చేసే భూములను దోచేశారన్నారు. టీడీపీ హయాంలో లులూ, హెచ్ఎస్‌బీసీ, అదాని డేటా సెంటర్ వంటి వాటిని తీసుకొస్తే...జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత వారందరినీ తరిమేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు కాలేదని, రైల్వే శాఖ అడిగిన భూమిని ఈ ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై జగన్ నోరు మెదపడం లేదన్నారు.

వైసీపీ అరాచక, అవినీతి పాలన సాగిస్తున్నదని చంద్రబాబు అన్నప్పుడు సభికుల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది. వైసీపీ పాలనలో మద్యం ధరలు, కరెంటు చార్జీలు, ఇళ్ల పన్నులు పెంపు, చెత్త పన్ను విధింపు, పెట్రోల్, డీజిల్ రేట్లు ఎంతెంత పెరిగాయో చంద్రబాబు సవివరంగా వెల్లడిస్తుంటే సభకు హాజరైన ప్రజలు శ్రద్ధగా ఆలకించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలు, రైతుల కోసం అమలు చేయనున్న 'సూపర్ సిక్స్' పథకాల గురించి వివరించారు. ప్రసంగం ముగించిన తరువాత 'సైకో పోవాలి...సైకిల్ రావాలి' అంటూ డీజేలో పాటనే ప్లే చేయగా, స్టేజీ ముందున్న యువత నృత్యాలు చేశారు. చంద్రబాబు నాయుడు రెండు చేతులు పైకెత్తి వారిని ... మిగతా 5వ పేజీలో


టీడీపీ నేతలు బహూకరించిన కరవాలాన్ని చూపుతున్న చంద్రబాబు


స్వచ్ఛమైన నల్ల మిరియాలు

మిరియాల రైతుకు ఊరట

వారపు సంతల్లో కిలో రూ.550కు కొనుగోలు చేసిన వర్తకులు

పాడేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఈ ఏడాది మిరియాల ధర ఆశాజనకంగా ఉందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సీజన్ ప్రారంభంలోనే కిలో రూ.550 చొప్పున వర్తకులు కొనుగోలు చేస్తుండడంతో ఆ తరువాత ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు, వర్తకులు అభిప్రాయపడుతున్నారు. సోమవారం పెదబయలు వారపు సంతలో కిలో రూ.550 చొప్పున గిరిజన రైతులు వర్తకులకు మిరియాలను విక్రయించారు. గత నాలుగేళ్లుగా ప్రతి ఏడాది మిరియాలు ధర ఆశాజనకంగా ఉంటుం దని రైతులు అంటున్నారు. గతంలో సీజన్ ప్రారంభంలో కిలో రూ.450 ఉంటూ, క్రమంగా సీజన్ ముగిసే నాటికి కిలో రూ.500 వరకు పెరిగేది. కానీ ఈ ఏడాది సీజన్ మొదట్లోనే రూ.550 ధర ఉండడంతో సీజన్ ముగిసే నాటికి కిలో రూ.600 లేదా రూ.620 వరకు ధర పెరుగుతుందని రైతులు, వర్తకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొడిసింగిలో వైసీపీ నేతలకు చేదు అనుభవం

సమన్వయకర్త విశ్వేశ్వరరాజు వాహనం అడ్డగింత
మంచినీటి పథకం నిర్మాణంపై ఎంపీపీని నిలదీసిన గిరిజనులు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 5: మండలంలోని లక్కవరపుపేట పంచాయతీ కొడిసింగి గ్రామంలో వైసీపీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎంపీపీ బోయిన కుమారికి చేదు అనుభవం ఎదురైంది. సోమవారం వైసీపీ సమన్వయకర్త, ఎంపీపీ లక్కవరపుపేట పంచాయతీలో పర్యటించారు. కొడిసింగి గ్రామానికి వచ్చిన సమన్వయకర్త విశ్వేశ్వరరాజు కారును స్థానిక మాజీ వార్డు సభ్యుడు పూజారి సత్యనారాయణ, వార్డు సభ్యులు వండలం కాంతమ్మ, గిరిజనులు చిన్నారావు, పూజారి రాజులమ్మలు అడ్డుకున్నారు. అయితే విశ్వేశ్వరరాజు కారు దిగకుండా అక్కడ నుంచి వెళ్లిపోయారు. వేరే కారులో వచ్చిన ఎంపీపీని వార్డు సభ్యులు, గిరిజనులు అడ్డుకుని గ్రామంలో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకంపై నిలదీశారు. ఇంటింటికి కొళాయి వేస్తామని చెప్పారే గానీ ఒక్క ఇంటికీ కొళాయి ఏర్పాటు చేయలేదన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ట్యాంక్ పరిమాణం తక్కువగా ఉందని, రక్షిత మంచినీటి పథకం నిర్మాణం పూర్తికాలేదని, స్థానిక ప్రజలు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారు చెప్పారు. నిర్మాణాలు జరుగుతాయని వారికి ఎంపీపీ చెబుతూ కారులో వెళ్లిపోయారు. దీంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఆదివాసీలు మళ్లీ గ్రామానికి ఏ వైసీపీ నాయకుడు వచ్చినా తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు.


ఎంపీపీ కుమారిని ప్రశ్నిస్తున్న మాజీ వార్డు సభ్యుడు, గిరిజనులు


విశ్వేశ్వరరాజు కారును అడ్డగించిన గిరిజనులు


జీసీసీ గోదాములో రికార్డులను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి హెచ్చరిక
పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం బియ్యం సరఫరాపై విచారణ
సేల్స్‌మన్, సూపరింటెండెంట్ తొలగింపు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 5: రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం బియ్యం అందలేని నిర్వాహకుల ఫిర్యాదు మేరకు సబ్ కలెక్టర్ సోమవారం విచారణ చేపట్టారు. ఆమె తొలుత జీకేవీధి డీఆర్ డిపో, జీసీసీ గోదామును సందర్శించి మధ్యాహ్న భోజన పథకం బియ్యం పంపిణీపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎంపీయూపీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. డీఆర్ డిపో నుంచి బియ్యం సరఫరా చేయకపోవడం వల్ల అప్పు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ... మిగతా 6వ పేజీలో

భారత్ హ్యాట్రిక్

విశాఖలో మరో విజయం వరుసగా మూడో టెస్ట్‌లో గెలుపు

కలిసొచ్చిన పిచ్‌పై కదంతొక్కిన ఇండియా
ఇంగ్లండ్‌పై 106 పరుగులతో విజయం
రాణించిన బుమ్రా, అశ్విన్ చెరో 3 వికెట్లు
ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ జస్‌ప్రీత్ బుమ్రా
ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా జైస్వాల్, గిల్



బుమ్రాను అభినందిస్తున్న సహచర ఆటగాళ్లు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 5: అద్వితీయమైన ఆటతీరుతో భారత్ జట్టు తనకు కలిసొచ్చే పిచ్‌పై మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో 106 పరుగులతో విజయం సాధించింది. దీంతో ఇప్పటివరకూ ఇక్కడ జరిగిన మూడు (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌తో) టెస్ట్ మ్యాచ్‌లలో విజయం సాధించినట్టయ్యింది.

కుప్పకూలిన ఇంగ్లండ్ బ్యాటింగ్

పిచ్‌పై పగుళ్లు ఏర్పడి నాలుగో రోజు స్పిన్నర్లకు అనుకూలించేలా మారినా కెప్టెన్ రోహిత్‌శర్మ ఫాస్ట్ బౌలర్లు బుమ్రా, అక్షర్ పటేల్‌లతోనే బౌలింగ్ ప్రారంభించాడు. ఓవర్‌నైట్ స్కోరు 67/1తో ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ జాక్ క్రాలీ, రెహన్ అహ్మద్ జట్టు స్కోరును వందకు చేర్చారు. ఆ సమయంలో రెహన్ అహ్మద్‌ను (23)ను అక్షరపటేల్ అద్భుతమైన బంతితో ఎల్బీడబ్ల్యు చేశాడు. రెహన్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన పోప్...కొద్దిసేపు బ్యాట్ ఝుళిపించాడు. బుమ్రా స్థానంలో బౌలింగ్‌కు వచ్చిన అశ్విన్...పోప్‌ను అవుట్ చేశాడు. పోప్ స్థానంలో వచ్చిన రూట్ కూడా అశ్విన్ ... మిగతా 6వ పేజీలో

జి.మాడుగులలో 12.9 డిగ్రీలు నమోదు

పాడేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాడేరులో సోమవారం ఉదయం పది గంటల తరువాతే సూర్యుడు కనిపించాడు. పది గంటలు దాటే వరకు పాడేరు, పరిసర ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కమ్మేసింది. సోమవారం ఏజెన్సీ ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినప్పటికీ పొగ మంచు, చలి ప్రభావం మాత్రం తగ్గకపోవడం విశేషం. సోమవారం జి.మాడుగులలో 12.9, ముంచంగిపుట్టులో 13.7, అనంతగిరిలో 14.2, పెదబయలులో 14.3, అరకులోయలో 15.1, డుంబ్రిగుడలో 15.6, పాడేరులో 15.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితో పాటు పొగ మంచు ఉదయం పది గంటల వరకు దట్టంగా అలముకుంటున్నది.

జీకేవీధి, చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినా చలిలో మార్పులేదు. 20 రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఏక సంఖ్యలో నమోదవుతున్నాయి. సోమవారం ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపించింది. జీకేవీధిలో 13.4, చింతపల్లిలో 16 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే ఉదయం, సాయంత్రం శీతల గాలులు అధికంగా వీస్తున్నాయి. చలితో పాటు మంచు అధికంగా కురుస్తున్నది. ఉదయం పదిన్నర గంటల వరకు లంబసింగి, తాజంగి, చింతపల్లి, ఆర్వీనగర్, జీకేవీధి ప్రాంతాల్లో మంచు వీడడం లేదు.

తగ్గని పొగమంచు


చింతపల్లిలో మంచు..


పాడేరులో సోమవారం ఉదయం పొగమంచు

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండలంలో మంచు దట్టంగా కురుస్తోంది. సోమవారం ఉదయం పది గంటల వరకు మంచు తెరలు వీడలేదు. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించలేదు. దీంతో హెడ్‌లైట్లు వేసుకుని వాహనచోదకులు రాకపోకలు సాగించారు. చలి గాలులు తీవ్రంగా వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

'రా కదలిరా' సభ సక్సెస్

మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొండుపాలెం సమీపంలో 'రా...కదలిరా' నినాదంతో తెలుగుదేశం పార్టీ సోమవారం నిర్వహించిన బహిరంగ సభకు అనకాపల్లి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతిపరులు భారీగా హాజరయ్యారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రసంగం ప్రారంభించడానికి ముందే సభా ప్రాంగణం మొత్తం నిండిపోయింది. ఇంకా చాలా మంది కార్యకర్తలు బయటే ఉండిపోయారు. చంద్రబాబునాయుడు వచ్చిన తరువాత టీడీపీ, జనసేన శ్రేణులు జై బాబు, జై పవన్ అంటూ నినాదాలు చేశారు.



టీడీపీ, జనసేన జెండా ఊపుతున్న చంద్రబాబు



ఎన్టీఆర్ ప్రతిమ వద్ద పూలు వేసి నివాళులర్పిస్తున్న చంద్రబాబు నాయుడు



వేదికపై తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు



పార్టీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న చంద్రబాబు



వేదికపై చంద్రబాబుతో టీడీపీ, జనసేన నాయకులు



వేదికపై ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు



మహిళల ఆనందోత్సాహం



హాజరైన అశేష ప్రజానీకం

జగన్ పాలనలో రైతులకు తీరని అన్యాయం: బుద్ద



కె.కోటపాడు, ఫిబ్రవరి 5: జగన్ పాలనలో రైతులు అన్ని రకాలుగా నష్టపోయారని, ప్రత్యేకించి చెరకు రైతులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద జగజగదీశ్వరరావు ఆరోపించారు. మండలంలోని గొండుపాలెంలో నిర్వహించిన 'రా.. కదలిరా' సభలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి వనరులు ఐదేళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురయ్యాయని, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం సంగతి అటుంచి, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేయడంతో ఆయకట్టుకు నీరు అందక వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయలేని దుస్థితి ఏర్పడిందని అన్నారు. జిల్లాలో నాలుగు షుగర్ ఫ్యాక్టరీలకు గాను మూడు ఫ్యాక్టరీలను వైసీపీ పాలకులు మూసివేయించి చెరకు రైతులకు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.

టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయం: బండారు



మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖ నగరానికి నీటిని సరఫరా చేసి, అనంతరం రైవాడ నీటిని పూర్తిగా ఈ ప్రాంత రైతుల అవసరాలకే కేటాయించాలని చంద్రబాబును కోరారు. జిల్లాలో వైసీపీ పాలనలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి రైతులకు, కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టే సత్తా బాబుకే ఉంది: పంచకర్ల



రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, తిరిగి గాడిలో పెట్టాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సి అవశ్యకత ఎంతైనా వుందని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. వైసీపీ పానలలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. టీడీపీ-జనసేన కూటమి 175/175 సీట్లు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్ర సర్వనాశనం: వి.అనిత



తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ, వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో సైకోను తరిమి కొట్టాలని, ధైర్యమే ఆయుధంగా కార్యకర్తలు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో డీఎస్సీని ప్రకటించడం నిరుద్యోగులను మోసగించడమేనని ఆమె విమర్శించారు.

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎలమంచిలి, ఫిబ్రవరి 5: ఎలమంచిలి, రేగుపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ ఎస్కే మారూఫ్ తెలిపారు. మృతుడికి 35-40 ఏళ్ల వయస్సు ఉంటుందని, లేత నీలం రంగు టీ షర్ట్, నలుపు రంగు జీన్ ప్యాంటు ధరించి వున్నాడని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా వుంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థి మృతిపై కొనసాగిన ఆందోళన

- మృతుని కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం
- ఇంట్లో ఒకరికి ఉపాధి, సాగు భూమి ఇస్తామని ఆర్డీవో హామీ
- శాంతించిన ఆందోళనకారులు



ఏరియా ఆస్పత్రి దగ్గర ఆందోళన చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, ఫిబ్రవరి 5 : విద్యుదాఘాతంతో మృతి చెందిన గొలుగొండ ఎస్టీ బాలుర వసతి గృహ విద్యార్థి తూబిరి దావిద్ రాజ్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని రెండో రోజూ ఆందోళన కొనసాగింది. సోమవారం విద్యార్థి సంఘాలు, గిరిజన సంఘాలు, గిరిజన ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల, గొలుగొండ ఎస్టీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి అప్పారావులను ఆర్డీవో విచారించారు. ఈ సందర్భంగా విద్యుత్ వైర్ల సమస్యపై గత నెల 23 తేదీన గొలుగొండ ఏఈకి ఫిర్యాదు చేశామని వార్డెన్ ఆర్డీవో తెలిపారు. విద్యార్థులు మేడ మీదకు వెళ్లకుండా మెట్ల మార్గంలో ముళ్ల కంచె వేశామని తెలిపారు. అనంతరం ఎస్టీ, ఎస్టీ సంఘాల నేతలతో చర్చలు జరిపారు. రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సాయం, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం, సాగు భూమి, ఇంట్లో ఒకరికి ఉపాధి ఇవ్వడానికి ఆర్డీవో హెచ్‌వీ జయరాం హామీ ఇచ్చారు. ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల, గొలుగొండ ఏపీ ఈపీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఏఈ రాజేంద్రకుమార్, వసతి గృహ సంక్షేమ అధికారిమడ్డు అప్పారావులపై కలెక్టర్‌కి నివేదిక పంపామని తెలిపారు. అనంతరం ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళనకారుల వద్దకు ఆర్డీవో వెళ్లి రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. మిగిలిన హామీలకు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎంపీపీ గజ్జల మణికుమారి, గిరిజన సంఘం నాయకులు గోవిందరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా జి. గీతాకృష్ణ, సీపీఎం నాయకులు అడిగర్ల రాజు, బీఎస్పీ ఇన్‌చార్జ్ నాగరాజు, విద్యార్థి సంఘం నాయకులు ఫణీంద్ర, రాధాకృష్ణ, దళిత సంఘాల నాయకులు నేతల నాగేశ్వరరావు, చిట్ల చలపతి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చంద్రబాబుకు నీరాజనం

... 3వ పేజీ తరువాయి

చంద్రబాబుకు స్వాగతం పలికారు. అనంతరం 11.55 గంటలకు చంద్రబాబు వేదికపైకి వచ్చారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం జై బాబు, జైజై బాబు అంటూ నినాదాలతో హోరెత్తింది. వేదికపై ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా ప్రసంగించారు.

గత ఎన్నికల్లో జగన్ మాయమాటలు నమ్మి ప్రజలు అధికారం ఇచ్చి మోసపోయారని, మళ్లీ ఇప్పుడు సిద్ధం అంటూ వస్తున్నాడని, ఇంకోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని చంద్రబాబు అన్నారు. వైసీపీ అరాచక పాలనను అంతమొందించి జగన్‌ను ఇంటికి పంపడానికి యువత, మహిళలు, రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రపంచంలో తెలుగు వారిని నంబర్ వన్‌గా ఉంచాలన్నదే తన లక్ష్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్క కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు ఇంత పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి ఎన్నికల యుద్ధానికి తాము సిద్ధమని సంకేతాలు పంపితే తాడేపల్లి పిల్లికి జ్వరం వస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, వైసీపీ అరాచక పాలనను అంతం చేయడానికి ప్రతిఒక్కరూ ఒక స్టార్ క్యాంపెయినర్‌గా మారాలని పిలుపునిచ్చారు. పేదల భూములు కొట్టేయడానికి వైసీపీ కొత్తగా తెచ్చిన భూ చట్టాన్ని టీడీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేస్తానన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం....

అంతకుముందు ఉదయం 11.45 గంటలకు హెలీకాప్టర్‌లో గొండుపాలెం చేరుకున్న చంద్రబాబునాయుడుకి టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు హెలీప్యాడ్‌లో దిగగానే కార్యకర్తలు, నాయకులు భారీసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, టీడీపీ నాయకులు దాడి వీరభద్రరావు, పప్పల చలపతిరావు, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడు, కేఎస్ఎన్ఎస్ రాజు, బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్‌చక్రవర్తి, దాడి రత్నాకర్, లాలం కాశినాయుడు, రొంగలి మహేశ్, దాడి ఎరుకునాయుడు, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, ఆ పార్టీ నాయకులు సుందరపు విజయ్‌కుమార్, రాయపురెడ్డి కృష్ణ, బి.శివదత్, పీవీఎస్ఎన్ రాజు, సూర్యచంద్ర, తదితరులు చంద్రబాబుకు స్వాగతం పలికారు.

జగన్ ఓ 420.. ఇది గూగుల్ చెప్పేమాట

- ఆయన ఏం చేశారని జనం ఓట్లేయాలి
- యువతకు చంద్రబాబు ఐటీలో ఉద్యోగాలు ఇస్తే, జగన్ చేపల దుకాణాలు, బ్రాందీ షాపుల్లో ఉద్యోగాలు ఇస్తున్నాడు
- మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు



సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

కె.కోటపాడు, ఫిబ్రవరి 5: దేశంలో 420 సీఎం ఎవరంటే ఏపీ సీఎం జగన్ పేరువస్తుందని, జగన్ 420 సీఎం అని తాను చెప్పడం లేదని...గూగుల్ చెబుతుందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం మధ్యాహ్నం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొండుపాలెంలో 'రా...కదలిరా' పేరుతో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్ తేలని జగన్‌కు ప్రజలు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. పంతొమ్మిదిసార్లు మోదీని కలిసిన జగన్, ప్రత్యేక హోదాపై ఎందుకు మాట్లాడలేదన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేసిన దౌర్భాగ్యుడు జగన్ అని, ఆయనకు వంతగాడిగా సజ్జల రామకృష్ణారెడ్డి తయారయ్యారన్నారు. ఉత్తరాంధ్రకు అన్యాయం చేసిన జగన్‌కు జనాలు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు పాలనలో యువకులకు ఐటీలో ఉద్యోగాలు కల్పిస్తే, జగన్ పాలనలో చేపల దుకాణాలు, మద్యం షాపుల్లో ఉద్యోగాలు ఇస్తున్నారని విమర్శించారు. జగన్ పాలనలో విశాఖను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. తాత తండ్రులు సంపాదించి ఇచ్చిన భూములకు సంబంధించి పత్రాలపై దిష్టిబొమ్మలా జగన్ ఫొటోలు ముద్రిస్తున్నారని, ఇది అవసరమా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ తొలగిస్తామన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన జగన్‌ను గద్దె దించి, రాజకీయ సమాధి కట్టాలని పిలుపునిచ్చారు. పోలీసులు కూడా మారాలని, వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమన్నారు. దోచుకునే దొంగ జగన్‌కు సహకారం అందించవద్దని విజ్ఞప్తి చేశారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ ఎస్టీల హత్యలు ఎక్కువైపోయాయని అయ్యన్నపాత్రుడు ఆరోపించారు.

అనకాపల్లి ఎంపీ సీటు నా కుమారుడికి లభిస్తే ఆదరించండి

అనకాపల్లి ఎంపీ సీటు కావాలని పార్టీని కోరామని, మాడుగుల మోదకొండమ్మ తల్లి దయతో ఒకవేళ తన కుమారుడికి అవకాశం వచ్చినట్టయితే, తనను ఆశీర్వదించినట్టే తన కుమారుడిని కూడా ఆశీర్వదించి గెలిపించాలని అయ్యన్నపాత్రుడు కోరారు.

విశాఖను వైసీపీ నేతలు దోచుకున్నారు

... 3వ పేజీ తరువాయి

మరింత ఉత్సాహపరిచారు. కాగా 'రా..కదలిరా' సభకు టీడీపీ నాయకులు ఊహించని దానికన్నా ఎక్కువ మంది హాజరయ్యారు. దీంతో సభా ప్రాంగణం మొత్తం నిండిపోగా, ఇంకా చాలామంది రోడ్లపైనే వుండాల్సి వచ్చింది. దీంతో వెంకన్నపాలెం-కె.కోటపాటు రోడ్డులో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సభాస్థలి నుంచి చౌడువాడ వరకు వాహనాలు బారులు తీరాయి.

22 నుంచి విశాఖలో ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను ఈనెల 22 నుంచి 25 వరకూ విశాఖలో నిర్వహించనున్నట్టు అఖిలభారత కోశాధికారి ఎస్.పుణ్యవతి తెలిపారు. సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల సమస్యలపై నిరంతర పోరాటాలు జరిగే విశాఖలో ఈ సమావేశాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. 1981లో అఖిల భారత సంఘంలో భాగంగా ఏర్పాటైన ఐద్వా ప్రస్తుతం కోటి మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద సంఘంగా తయారైందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్త్రీల హక్కులను కాలరాయడం, స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేస్తోందన్నారు. కులం, మతం, కట్టుబాట్ల పేరుతో మహిళలను అణిచివేస్తోందని ఆరోపించారు. అసమానతలు అధిగమిస్తేనే మహిళా అభ్యున్నతి సాధ్యమవుతునందన్నారు. మహిళల హక్కుల పరిరక్షణ, స్వేచ్ఛ కోసం చేయాల్సిన పోరాటం, కర్తవ్యాలపై జాతీయ సమావేశాల్లో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమావేశాలకు అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, మహిళా అభ్యుదయవాదులు హాజరై విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశాలు ప్రారంభం రోజైన 22న భారీ ప్రదర్శన, బహిరంగసభ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి పాల్గొన్నారు.

వేతనం పెంపు హామీ ఐదేళ్లయినా అమలు చేయలేదు

- భోజన పథకం కార్మికులకు రాష్ట్ర సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి ధ్వజం
- డిమాండ్ల సాధనకు కార్మికులు ధర్నా



నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి రాక ముందు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా భోజన పథకం కార్మికులకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, ఐదేళ్లయినా అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. ప్రతి నెల ఐదో తేదీలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, మెనూ చార్జీలను రూ.20కి పెంచాలని, ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఏటా రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఎం.శ్రీదేవి, ఎస్.గౌరి, ఎస్.అమ్మాజీ, ఎస్కే బాబీ తదితరులు పాల్గొన్నారు.


అడ్డాకుల ప్లేట్ మేకింగ్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వీడీవీకేలతో మెరుగైన జీవనోపాధి

» జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వన్‌దన్ వికాస కేంద్రాల (వీడీవీకే)తో గిరిజన మహిళల జీవనోపాధి మెరుగుపడుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అడ్డాకుల ప్లేట్ మేకింగ్ సెంటర్‌ను సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీడీవీకేల ద్వారా అటవీ ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి ఆర్థికంగా ఎదిగేందుకు గిరి మహిళలు కృషి చేయాలన్నారు. అలాగే వీడీవీకే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగార్థులకు జిల్లా ఎస్పీ సత్కారం


ఎస్‌ఐ ఉద్యోగార్థులతో ఎస్పీ తుహిన్‌సిన్హా, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) అనిల్‌కుమార్

పాడేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఇటీవల ఎస్‌ఐ ఉద్యోగాలు పొందిన జిల్లాకు చెందిన అభ్యర్థులను ఎస్పీ తుహిన్‌సిన్హా సోమవారం తన కార్యాలయంలో సత్కరించారు. జిల్లాకు చెందిన బోనంగి సాయిరాంపడాల్, షేక్ జిలానీ, గుజ్జలి కమల్‌భార్గవ్, కారం క్రాంతి, వీసంశెట్టి నాని, పోతంశెట్టి వీరచక్రదొర, సిద్ద దుర్గా ప్రసాద్, వెంకటేశ్వరరావు కలిపి మొత్తం తొమ్మిది మంది ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో తొలి ఐదుగుర్ని ఎస్పీ తన కార్యాలయానికి పిలిచి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. వృత్తిపరంగా వారికి అవసరమైన పలు సూచనలు, సలహాలను ఈ సందర్భంగా ఎస్పీ అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి.అనిల్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎల్.హిమగిరి పాల్గొన్నారు.

అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన


భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న డీఈఈ సన్యాసినాయుడు

అరకులోయ, ఫిబ్రవరి 5: స్థానిక మహిళా డిగ్రీ కళాశాల పరిపాలనా భవన సముదాయ నిర్మాణాన్ని ఈ పనులను పర్యవేక్షిస్తున్న డీఈఈ సన్యాసినాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం చురుగ్గా జరుగుతున్నదని, నెల రోజుల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.7.5 కోట్లను బిల్లుగా అందించినట్టు చెప్పారు. మరో రూ.50 లక్షల వరకు బిల్లు చెల్లించాల్సి ఉందన్నారు. కళాశాల భవనానికి ప్రహరీ గోడ, సీసీ రోడ్డు నిర్మాణానికి మరో కోటి రూపాయలు అవసరమని అంచనా వేసి కమిషన్‌కు నివేదికలుఏప పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని డీఈఈ తెలిపారు.

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్న భోజన పథకం బియ్యం పంపిణీలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన జీకేవీధి డీఆర్ డిపో సేల్స్‌మన్ తొలగించాలని, రేషన్ సరకుల పంపిణీ బాధ్యతలను వీఆర్వోకు అప్పగించాలన్నారు. విధి నిర్వహణలో జీసీసీ గోదాము సూపరింటెండెంట్ లోపాలను గుర్తించి, ఆయనను తొలగించి సీనియర్ ఉద్యోగికి బాధ్యతలు అప్పగించాలని జీసీసీ డీఎం పి.దేవరాజును ఆదేశించారు. డీఆర్ డిపోను సీజ్ చేసి పౌర సరఫరాల శాఖ అధికారుల ఆధీనంలో ఉంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం బియ్యం పంపిణీపై నిర్లక్ష్యం ప్రదర్శించిన జీకేవీధి జీసీసీ బ్రాంచి మేనేజర్, ఉప తహసీల్దార్‌లకు షోకాజు నోటీసులు జారీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం రేషన్ సరఫరాపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు.

అనుమానాస్పదంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

» విషాదాంతంగా ముగిసిన ప్రేమకథ
» ప్రియుడే కారణమంటున్న బంధువులు
» చంపాలని ఉద్దేశపూర్వంగా విషం తాగించాడని ఆరోపణలు


రుత్తల రత్నమాధురి (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, ఫిబ్రవరి 5: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన రుత్తల అమ్మాజీ చిన్న కుమార్తె రత్నమాధురి (26), నాతవరం మండలం వెన్నలపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి శేఖర్ ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే పనిచేస్తున్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పిన శేఖర్ ...ఆ తరువాత మాటమార్చాడు. దీంతో ఇరువురు కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరిగాయి.

గుడి వెళతానని బయటకు....

గత నెల 27వ తేదీన రత్నమాధురి గుడికి వెళ్లి వస్తానని తల్లికి చెప్పి బయటకు వెళ్లింది. ఎంతకీ రాకపోయే సరికి ఫోన్ చేస్తే ఫ్రెండ్ దగ్గర ఉన్నాను...వస్తాను అని చెప్పింది. అదేరోజు అర్థరాత్రి రెండు గంటల సమయంలో శేఖర్ తన కుమార్తెను ఇంటి వద్ద దింపి వెళ్లాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రత్నమాధురి తల్లి పేర్కొన్నారు. ఎక్కడకు వెళ్లారని తన కుమార్తెను ప్రశ్నిస్తే శేఖర్ వైజాగ్ తీసుకు వెళ్లాడని చెప్పిందని వివరించారు. తలనొప్పిగా ఉంది పడుకుంటానని చెప్పి రత్నమాధురి గదిలోకి వెళ్లిందని, మరుసటిరోజు నుంచి నీరసించిపోయి ఒంటరిగా గదిలో ఉండిపోయిందని ఆమె తల్లి పోలీసులకు చెప్పారు. రెండు రోజుల తర్వాత వాంతులు అవుతుండడంతో జనవరి 30వ తేదీన ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించామని, వైద్యులు రెండు రోజులు చికిత్స అందించినా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో వైద్యులకు అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో శేఖర్‌కు రత్నమాధురి పెద్దమ్మ కుమార్తె లాలం శిరీషా ఫోన్ చేసి అసలు ఏం జరిగిందని ప్రశ్నించింది. దీంతో శేఖర్ పాయిజన్ సీసా ఫొటో ఒకటి వాట్సాప్‌కు షేర్ చేశాడు. ఆ సీసా చూసిన డాక్టర్ హుటాహుటిన విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి కోమాలోకి వెళ్లిపోయింది. ఆదివారం సాయంత్రం కోమా నుంచి బయటకు వచ్చినట్టు దగ్గర బంధువు లాలం శ్రీరంగస్వామి చెప్పారు. తమతో మాట్లాడే ప్రయత్నం చేసి మళ్లీ కోమాలోకి వెళ్లిందన్నారు. రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆదివారం రాత్రి 10.30కు తుది శ్వాస విడిచింది.

విషం తాగి చనిపోదామని నమ్మించాడా ?

గత నెల 27 తేదీన రత్నమాధురిని కలిసిన శేఖర్...ఇద్దరం విషం తాగి చని పోదామని చెప్పి...ముందు రత్నమాధురితో తాగించి తాను తాగి ఉండడని ఆమె బంధువు లాలం శ్రీరంగస్వామి ఆరోపిస్తున్నారు. మృతురాలి తల్లి అమ్మాజీ ఈ నెల 2వ తేదీన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో...వాసిరెడ్డి సన్యాసినాయుడు ఉరఫ్ శేఖర్ తన కూతుర్ని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, తనను వదించుకోవాలని ఉద్దేశంతో విషం తాగించాడని ఆరోపించారు. కాగా రత్నకుమారిది ఆత్మహత్య, హత్యా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. దీనిపై పట్టణ సీఐ క్రాంతికుమార్‌ను వివరణ కోరగా...మృతురాలి తల్లి అమ్మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జగన్ మళ్లీ గెలిస్తే ఆదివాసీల ఉనికికే ముప్పు

» టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర


టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పార్టీ ఇన్‌చార్జి దొన్నుదొర

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 5: జగన్‌ను ఒకసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నందుకు గిరిజన ప్రాంతంలో సంపద ఎక్కడెక్కడ దోచుకోవడానికి అవకాశం ఉందో గుర్తించి తవ్వకాలు మొదలు పెట్టారని, మళ్లీ గెలిపిస్తే ఆదివాసీల ఉనికికే ముప్పు వాటిల్లుతుందని తెలుగుదేశం పార్టీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని కొర్రా, కితలంగి, పోతంగి పంచాయతీల పరిధిలో పూలుగుడ, కొర్రా, పెదపాడు, శీలంగొంది, చంపాపట్టి గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ నిరంకుశ పాలనపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఆరు గ్యారెంటీ పథకాలతో టీడీపీ రూపొందించిన మేనిఫెస్టోను గిరిజనులకు వివరించారు. ఆయా గ్రామాల్లో పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరగా, వారికి దొన్నుదొర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అండగా నిలుస్తాడని గిరిజనులు నమ్మి జగన్‌ను గెలిపిస్తే, గిరిజన ప్రాంతంలో సంపదను దోచుకోవడానికి తన బినామీలను ఇక్కడ పెట్టుకున్నారని ఆరోపించారు. వైసీపీ అధికారంలో వస్తే భవిష్యత్తులో గిరిజన ప్రాంతం మరో పదేళ్లు వెనక్కు వెళ్లిపోతుందని చెప్పారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో గిరిజన హక్కులు నిర్వీర్యమవుతుంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించకుండా, వారి కుర్చీలను కాపాడుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని దొన్నుదొర పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి గిరిజన ప్రాంత అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, మాజీ ఎంపీపీ దన్నెరావు, మాజీ సర్పంచులు సుబ్బారావు, ఆనందరావు, నాయకులు బొంజుబాబు, బీమన్న, విశ్వనాథం పాల్గొన్నారు.

శరవేగంగా ఎకో టూరిజం ప్రాజెక్టు

» నెలాఖరు నాటికి ప్రారంభానికి చర్యలు
» డీఎఫ్‌వో సూర్యనారాయణ



టెంట్లను ఏర్పాటుచేస్తున్న అటవీ శాఖ అధికారులు... ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ

చింతపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని కృష్ణాపురం పైన్ తోటల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని స్థానిక డీఎఫ్‌వో చిట్టపులి సూర్యనారాయణ తెలిపారు. సోమవారం కృష్ణాపురం ఎకో టూరిజం ప్రాజెక్టు వద్ద క్యాంప్ టెంట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీపంలో వున్న కృష్ణాపురం పైన్ తోటల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మాణానికి అటవీశాఖ రూ.25 లక్షల నిధులు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో 2.5 హెక్టార్ల విస్తీర్ణంలో ఎకో టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే అంతర్గత రోడ్లు నిర్మించామన్నారు. బోర్‌వెల్ నిర్మించి రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించామన్నారు. పర్యాటకుల కోసం 2.5 కిలోమీర్ల వాకింగ్ ట్రాక్ సిద్ధం చేశామని తెలిపారు. ఎకో టూరిజం ప్రాజెక్టు వద్ద ఆకర్షణీయమైన మొక్కలను నాటామన్నారు. ప్రస్తుతం పర్యాటకుల కోసం ప్లాట్‌ఫామ్స్ నిర్మించి క్యాంప్ టెంట్లను సిద్ధం చేస్తున్నామన్నారు. 10 కింగ్ సైజ్, 15 డబుల్ సైజ్ టెంట్లను ఏర్పాటు చేశామన్నారు. పది మరుగుదొడ్లు నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తికాగానే పర్యాటకులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. క్యాంటీన్ సైతం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో సమావేశ మందిరం, శాశ్వత హట్స్ నిర్మిస్తామన్నారు. కృష్ణాపురం ఎకో టూరిజం ప్రాజెక్టును నెలాఖరు నాటికి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీనగర్ సబ్ డీఎఫ్‌వో రాజు, ఎఫ్‌ఎస్‌వోలు అప్పారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై పోరాటం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 5: ఆదివాసీల సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తున్నామని ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాచిపెంట శాంతికుమారి చెప్పారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనం వద్ద సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజనుల హక్కులు, చట్టాలపై తనకు అవగాహన ఉందని, వాటిని కాపాడుకోవడానికి ఏ పోరటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అరకు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉంటానని, ఆదివాసీలంతా సహకరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ సాయిబాబా, నాయకులు సోమేశ్వరరావు, చిన్నస్వామి, జగన్నాథం, మితుల పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

» పార్టీ మండల అధ్యక్షుడు బలరాం


మినీ మేనిఫెస్టో కరపత్రాలు అందిస్తున్న బలరాం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 5: టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు కె.బలరాం అన్నారు. లక్ష్మీపురం పంచాయతీలోని అర్లోయిపుట్టు, తుమ్మిడిపుట్టు, సుత్తిగూడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యతు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలపాలని, పార్టీ అధికారంలోకి వస్తేనే యువతకు అన్ని విధాలుగా ఉపయోగకరమని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.రామస్వామి, ఎస్.బాబూజీ, కె.జగత్‌రాయ్, పి.కామేశ్వరరావు, రామారావు, ధర్మ, మజ్జి చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తొలి మేనిఫెస్టోతో వైసీపీలో గుబులు

చింతపల్లి: టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టో వైసీపీ నాయకుల్లో గుబులు పుట్టిస్తున్నదని పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని బుడతలవేనం గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు పథకాలు అత్యద్భుతంగా ఉన్నాయని కితాబునిచ్చారు. ఇప్పటికే వైసీపీ పాలనపై తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు, టీడీపీ వైపు ఆసక్తి చూస్తున్నారని చెప్పారు. తాజాగా టీడీపీ ప్రకటించిన సంక్షేమ పథకాల మేనిఫెస్టో మరింతగా ఆకట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకాలు ప్రజలందరికీ తెలియాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్కోజు నాగభూషణం, మంగ్లు పాల్గొన్నారు.

'బస్సు ప్రమాద బాధితులకు పరిహారం చెల్లించాలి'

పాడేరు రూరల్, ఫిబ్రవరి 5: పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో బాధిత కుటుంబాలకు తక్షణమే పరిహారాన్ని చెల్లించాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టు 20న విశాఖపట్నం నుంచి పాడేరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఘాట్‌లో బోల్తాపడడంతో ఇద్దరు మృతి చెందగా, మరి కొంత మంది గాయపడిన విషయం తెలిసిందేనన్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం అందిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. బస్సు ప్రమాద బాధితులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేదని వాపోయారు. సీఎం జగన్‌కు హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయడం చేతకాదా? అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధితులు కుంబిడి లక్ష్మణరావు, బోయిన నాగేశ్వరరావు, కిల్లో బోడురాజు, కె.బొంజుబాబు, వి.కోటిబాబు, పి.సింహాద్రి, పి.ప్రభ, జి.నాగేష్, టి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఏవోబీలో మావోయిస్టుల పేరిట వాల్ పోస్టర్లు

» పార్టీకి ద్రోహం చేసిన ఐదుగురు మావోయిస్టు సభ్యులను తొలగింపు


డుడుమ సమీపంలో అతికించి ఉన్న పోస్టర్

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 5: మావోయిస్టు పార్టీ ఆంధ్రా, ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పేరిట సోమవారం ఏవోబీలోని డుడుమ, ఒనకడిల్లీ ప్రాంతాలలో తెలుగు, ఒడియా భాషలలో వాల్‌పోస్టర్లు వెలిశాయి. 'మా పార్టీ సభ్యులు రమేష్, రాకేశ్, స్వప్న, తులసి, సంతులు పార్టీకి ద్రోహం చేసి, మాకు తెలియకుండా పార్టీని విడిచి వెళ్లిపోయారు. వీరంతా నెల రోజులుగా ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన రంగబయలు, బుంగాపుట్టు, కొండూరుం ప్రాంతంలో సంచరిస్తున్నట్టు తెలిసింది. ఆ ప్రాంతంలో పని చేస్తున్న కాంట్రాక్టర్ల నుంచి, మారుమూల గ్రామాల ప్రజల నుంచి మావోయిస్టుల పేరు చెప్పి డబ్బులు, నిత్యావసర సరుకులను వసూళ్లకు పాల్పడుతున్నట్టు సమాచారం. దాని కారణంగా మా పార్టీ పరువు పోతుంది. మావోయిస్టులకు విరోధంగా ఉంటే ఐదుగురిని పార్టీ నుంచి తీసివేయడం జరిగింది. గ్రామాల్లో ప్రజలు వారికి ఎటువంటి సహాయం చేయకుండా వాళ్లను బంధించి మాకు తెలియజేయండి.' అని ఈ పోస్టర్లలో రాసి ఉంది.

కంఠారంలో రెండు పూరిళ్లు దగ్ధం

కొయ్యూరు, ఫిబ్రవరి 5: మండలంలోని కంఠారం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన డొంకా లక్ష్మికి చెందిన తాటాకు ఇంటి నుంచి అర్ధ రాత్రి 12 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ పక్కనే ఉన్న ఇంటికి కూడా మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో రెండు ఇళ్లల్లో లక్ష్మి, పెదగాడి సూర్యకాంతం, డొంక షణ్ముకాచారి, కల్యాణి, బ్రహ్మజీ, రోహిత్ నిదురిస్తున్నారు. మంటల వేడికి ఇంట్లో వారందరూ బయటకు పరుగులు తీయడంతో ప్రాణ నష్టం తప్పింది. ప్రమాద ఘటనను గుర్తించిన గ్రామస్థులు మంటలను అదుపు చేశారు. దీంతో గ్రామానికి పెను ముప్పు తప్పింది. ప్రమాద ఘటనలో బాధిత రెండు కుటుంబాలకు చెందిన గృహోపకరణాలు, తిండి గింజలు, బట్టలు, కొంత నగదు కాలి బూడిదైంది. దీంతో బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

దొడ్డవరం అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు

» బిల్లులు చెల్లించలేదని తలుపులు మూసేసిన కాంట్రాక్టర్


కేంద్రానికి తాళాలు వేస్తున్న మునిపిపల్ చైర్‌పర్సన్

కొయ్యూరు, ఫిబ్రవరి 5: అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు పూర్తిచేసి ఐదేళ్లు గడుస్తున్నా బిల్లులు చెల్లించని కారణంగా మర్రివాడ పంచాయతీలోని దొడ్డవరం కేంద్రానికి సంబంధిత కాంట్రాక్టర్ తాళాలు వేశారు. ఈ కేంద్రం భవన నిర్మాణాన్ని కనిగిరి రాజబాబు అనే కాంట్రాక్టరు చేపట్టారు. 2019లోనే నిర్మాణాలను పూర్తి చేశారు. అప్పటిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ.5 లక్షలు, ఐసీడీఎస్ నిధులు రూ.2.5 లక్షలు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.2.5 లక్షలు కలిపి రూ.10 లక్షలు మంజూరు కాగా, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం వారి పర్యవేక్షణలో కాంట్రాక్టరు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. దీనికి సంబంధించి బిల్లుల కోసం కాంట్రాక్టర్ కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేని విషయాన్ని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బిల్లుతో పాటు చీడిపాలెం, యు.చీడిపాలెం, రేవళ్ల పంచాయతీలలో నిర్వహించిన మరో ఆరు పనులకు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు వీలుగా ఎంపీడీవో, ఏపీవోలకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. నేటికీ చెల్లింపులు జరగకపోవటంతో దొడ్డవరం అంగన్‌వాడీ భవనానికి కాంట్రాక్టరు రాజబాబు సోమవారం తాళాలు వేశాడు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ఆటంకం ఏర్పడింది.

భారత్ హ్యాట్రిక్

... 3వ పేజీ తరువాయి

బౌలింగ్‌లోనే అక్షరపటేల్ క్యాచ్ పట్టడంతో వెను తిరిగాడు. వ్యక్తిగత 61 పరుగుల వద్ద స్టంపౌట్ నుంచి తప్పించుకున్న జాక్ క్రాలీ (73)ని కులదీప్ యాదవ్ ఎల్‌బీడబ్ల్యుగా అవుట్ చేశాడు. కొద్దిసేపటికే జానీ బెరస్టోవ్‌ను (26) బుమ్రా ఎల్‌బీడబ్ల్యుగా పెవెలియన్‌కు పంపడంతో లంచ్ సమయానికి ఇంగ్లండ్ 194 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. లంచ్ తర్వాత కెప్టెన్ బెన్ స్టోక్ (11) అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. ఆ తరువాత బెన్ ఫోక్స్ (36), టామ్ హార్డ్‌లీ (36) కలిసి ఎనిమిదో వికెట్‌కు 50 పరుగులు జోడించి భారత్ బౌలర్లకు సహన పరీక్ష పెట్టారు. బెన్ ఫోక్స్‌ను బుమ్రా అవుట్ చేయగా, ఫోక్స్ స్థానంలో వచ్చిన షోయబ్ బషీర్ (0) కొద్దిసేపటికే ముకేష్‌కుమార్ బౌలింగ్‌లో కీపర్ భరత్‌కు క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు. చివరిగా టామ్ హార్డ్‌లీని బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లంగ్ రెండో ఇన్నింగ్స్ 292 పరుగుల వద్ద ముగిసి ఓటమి చెందింది.

ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను చుట్టేసిన బుమ్రా, అశ్విన్ ఫాస్ట్ బౌలర్ బుమ్రా, స్పిన్ మాంత్రికుడు అశ్విన్‌లు టీ విరామ సమయానికి ముందే ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను చుట్టేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసిన బుమ్రా...రెండో ఇన్నింగ్స్‌లో కూడా పదునైన బంతులతో మూడు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ తీయలేకపోయినా అశ్విన్...రెండో ఇన్నింగ్స్‌లో మూడు కీలక వికెట్లు పడగొట్టి టెస్టు కెరీర్‌లో 499 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో ఓటమి చెందిన భారత్...ఇక్కడ జరిగిన రెండో టెస్టులో ఒకరోజు మిగిలి ఉండగానే అద్భుతమైన గెలుపుతో ప్రతీకారం తీర్చుకుని సిరీస్‌ను సమం చేసింది. చివరి వికెట్‌గా టామ్ హార్డ్‌లీని బుమ్రా క్లీన్ బౌల్డ్ చేసిన వెంటనే స్టేడియం హోరెత్తింది. ప్రేక్షకులు స్టాండ్స్‌లో నిలబడి భారత్ ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లేవరకూ అభినందనలు తెలిపారు.

ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా

రెండు ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లు పడగొట్టి భారత్ జట్టు విజయంలో కీలకపాత్ర వహించిన బుమ్రా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (209) చేసిన యశశ్వి జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (104) చేసిన శుభమన్ గిల్ ఉత్తమ బ్యాట్స్‌మెన్ అవార్డు అందుకున్నారు.

సంక్షిప్తంగా..

హుకుంపేటలో రక్తదాన శిబిరం రేపు

పాడేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట మండలం కేంద్రంలో ఈ నెల 7వ తేదీన రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తారని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర రోగులు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు దాతలు మరింత ముందుకు రావాలని సూచించారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

దశల వారీగా పక్కా రహదారుల నిర్మాణం: జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 5: గిరిజన ప్రాంతంలో మారుమూల గ్రామాలకు దశల వారీగా పక్కా రహదారులు నిర్మిస్తామని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చెప్పారు. మండలంలోని మారుమూల మాలగుమ్మి నుంచి బి.బాదిపుట్టు వరకు పక్కా రహదారి నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాలకు పక్కా రహదారులను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రూ.2 కోట్లు వెచ్చించి ఈ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రతీ గ్రామానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ రత్నాలమ్మ, నాయకులు మల్లికార్జునరావు, ఎ.జగబంధు, జయదేవ్, కొండలరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పాడేరు తహసీల్దార్‌గా అరుణకుమారి బాధ్యతలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 5: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు తహసీల్దార్‌గా ఎం.అరుణకుమారి సోమవారం బాధ్యతలను చేపట్టారు. ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా గజపతినగరం తహసీల్దార్‌గా పనిచేస్తున్న అరుణకుమారి ఇక్కడికి వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆమెకు కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మను ఆమె దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కూడా భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్ బజ్జంగి నల్లన్న, వీఆర్‌వోలు జె.వెంకటలక్ష్మి, వి.లక్ష్మి, పి.పద్మావతి, కొండమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి తహసీల్దార్‌గా రాధకృష్ణమూర్తి

చింతపల్లి: తహసీల్దార్‌గా సిహెచ్.రాధాకృష్ణమూర్తి నియమితులయ్యారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన లత్సాపాత్రుడు శ్రీకాకుళం బదిలీ కాగా, ఆతని స్థానంలో పార్వతీపురం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రాధాకృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా విధుల్లో చేరిన తహసీల్దార్‌కు డీటీ రాజ్‌కుమార్, రెవెన్యూ ఉద్యోగులు స్వాగతం పలికారు.

ముంచంగిపుట్టు తహసీల్దార్ రఫీజాన్

ముంచంగిపుట్టు: తహసీల్దార్‌గా అజ్జు రఫీజాన్ సోమవారం బాధ్యతలను చేపట్టారు. విజయనగరం జిల్లా బాడంగి మండలంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న రఫీజాన్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. గతంలో జీకే వీధిలో హెచ్‌డీటీగా పనిచేసిన అనుభవం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు అందర్ని కలుపుకుంటూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తహసీల్దార్ పేర్కొన్నారు.

15న ఏవోబీలో వాలీబాల్ టోర్నమెంట్

జి.మాడుగుల, ఫిబ్రవరి 5: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు మండలాల పంచాయతీల పరిధిలోని గ్రామాల క్రీడాకారులకు ఈ నెల 15న సూరిమెట్లలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. జి.మాడుగుల మండలం నుంచి బొయితిలి, కిల్లంకోట, నుర్మతి, లువ్వాసింగి, పెదయలు మండలం నుంచి లింగేటి, బొంగరం, గిన్నెలకోట, ఇంజరి, జామిగూడ, ముంచంగిపుట్టు మండలం కుమడ, బూసుపుట్టు తదితర పంచాయతీల్లోని గ్రామాల వాలీబాల్ క్రీడాకారులు మహిళా పోలీసుల సమక్షంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వాలీబాల్ పోటీలో పాల్గొన ప్రతీ జట్టుకు వాలీబాల్ కిట్లతో పాటు యూనిఫారం అందిస్తామని ఆయన ప్రకటించారు.


వారపు సంతలో ముమ్మరంగా తనిఖీలు

పెదబయులు, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టితో మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు స్టేట్ బ్యాంకు కూడలిలో, పాడేరు వైపు నుంచి వచ్చే వాహనాలను పోలీసు స్టేషన్ నందు తనిఖీలు చేశారు. వాహన రికార్డులు, ప్రయాణికుల బ్యాగులను పరిశీలించారు. అనుమానితుల చిరునామాలు తెలుసుకొని విడిచిపెట్టారు. ప్రతీ వాహనదారుడు లైసెన్స్‌తో పాటు వాహన రికార్డులను కలిగి ఉండాలని, అతి వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

నేత్ర చికిత్సలకు 30 మంది తరలింపు

చింతపల్లి, ఫిబ్రవరి 5: ఏరియా ఆస్పత్రి నుంచి 30 మంది గిరిజనులకు కంటి శస్త్ర చికిత్సల కోసం విశాఖపట్నం తరలించామని వైద్యాధికారి వి.రుక్మిణి తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో దృష్టి ఐకేర్ కేంద్రంలో ప్రతీ రోజు దృష్టి లోపంతో బాధపడుతున్న వ్యక్తులకు పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు సిఫారసు చేస్తున్నామన్నారు. శస్త్ర చికిత్స అవసరమైన బాధితులను 30 మందిని సోమవారం ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం జిల్లా కంటి ఆస్పత్రికి తరలించినట్టు ఆమె చెప్పారు. ఉచితంగా శస్త్ర చికిత్స చేయడంతో పాటు రోగులకు రవాణా, భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్టోమెట్రిస్టు గాలి జగన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో సీలేరు జట్టు విజయం


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో వరప్రసాద్

సీలేరు, ఫిబ్రవరి 5: నెల్లూరులో సోమవారం జరిగిన విద్యుత్ శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో సీలేరు జట్టు ఘన విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో విజయవాడ ట్రాన్స్‌కో జట్టుపై సీలేరు జట్టు 84 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. మొదటి బ్యాటింగ్ చేసిన సీలేరు ఏపీ జెన్‌కో జట్టు 20 ఓవర్లలో 189 పరుగులు చేయగా, 105 పరుగులకే విజయవాడ జట్టు అన్ని వికెట్లు కోల్పోయింది. సీలేరు జట్టు క్రీడాకారుడు అనుదీప్ (ఏఈ) 50 పరుగులు, ఎస్.వరప్రసాద్ 22 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో మూడు వికెట్లు సాధించాడు. దీంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వరప్రసాద్ అధికారులు ఎంపిక చేశారు.